
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 41 | శనివారం 21 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# గత పాలకులు పరిశ్రమల్ని తరిమేశారు

### మేము వాటిని తిరిగి తెస్తున్నాం.. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న నమ్మకాన్ని పోగొట్టారు

### వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చేలా కొందరు ప్రవర్తిస్తున్నారు

### వినుకొండ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**(అంకుశం, వినుకొండ, ఫిబ్రవరి 21):**

గత పాలకులు రాష్ట్రం నుండి పరిశ్రమల్ని తరిమేస్తే మేము వాటిని తిరిగి తెస్తున్నాం అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వినుకొండ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న నమ్మకాన్ని పోగొట్టారు అని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఏపీ పునర్నిర్మాణం మొదలు పెట్టాం. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చాం. టీచర్లు, పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలు ఇచ్చాం. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండేలా వేగంగా పనులు చేశాం. కొత్త రోడ్లను కూడా నిర్మిస్తున్నాం. శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను - మిగతా 2లో







## బడ్జెట్ సమావేశాలా లేదా లడ్డూ సమావేశాలా

### ఏపీ అసెంబ్లీ నిర్వహణ దారుణం,.. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శ



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 21):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో జరుగుతున్నవి బడ్జెట్ కు సంబంధించిన చర్చలా లేక లడ్డు వివాదానికి సంబంధించిన చర్చలా అనేది అర్థం కావటంలేదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు కె రామకృష్ణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతి లడ్డు కల్తీ వివాదానికి సంబంధించి రాష్ట్ర శాసనసభలో, శాసనమండలిలో, మంత్రివర్గంలో, ఆఖరుకు ఢిల్లీలో ప్రెస్ మీట్లు పెట్టి మరీ మాట్లాడుతున్నారు. లడ్డూ సమస్య తప్ప రాష్ట్రంలో ఇంకే సమస్య లేనట్టు అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలకు, దూషణలకు దిగటం విచారకరం. లడ్డు వివాదానికి ఇకనైనా ఫుల్ స్టాప్ పెట్టేందుకు అధికార, ప్రతిపక్షాలు ఏమాత్రం ప్రయత్నించడం లేదు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందంటూ డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న వారు ఏం చేశారో సమాధానం చెప్పాలి. తిరుపతి లడ్డు విషయంలో కల్తీ జరిగిందని అందరూ అంగీకరిస్తున్నారు. కోట్లాది రూపాయలు చేతులు మారాయని చెబుతున్నారు. లడ్డు కల్తీ జరిగి, కోట్లాది రూపాయలు చేతులు మారినప్పుడు డబల్ ఇంజన్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోలేక పోయింది? పోలీసు వ్యవస్థ, సిఐడి, సిబిఐలు డబల్ ఇంజిన్ సర్కార్ చేతుల్లోనే ఉన్నప్పటికీ ఏమీ చేయలేక పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేతకాక కేవలం మాటల ప్రభుత్వంగానే మిగిలిపోతున్నది. కూటమి పాలకులు లడ్డూ అంశాన్ని రోడ్డెక్కి మాట్లాడడం, పత్రికల్లో, మీడియాలలో మాట్లాడడం - మిగతా 2లో

## మత్స్యకారులకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల


**4.75 కోట్లు లబ్ధ**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**



**(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 21):**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



## ఏళ్ల నిరీక్షణకు తెర!

- ఇకనుంచి గృహలక్ష్మి పథకానికి ఇందిరమ్మ భరోసా!
- గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఏళ్ల నిరీక్షణకు ముగింపు
- ప్రభుత్వాలు మారడంతో మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

**హైదరాబాద్**

గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఏళ్ల నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలికింది. 2023లో సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 3లక్షలు సాయం అందించేలా అప్పటి బీఆర్?ఎస్? ప్రభుత్వం గృహలక్ష్మి పథకం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే ఏళ్ల క్రితం ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడం వల్ల చేపట్టిన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. - మిగతా 3లో

# భారత్-బ్రెజిల్ కలిస్తే గ్లోబల్ సౌత్ మరింత బలోపేతం

లఅంతర్జాతీయ వేదికపై భారత్, బ్రెజిల్ దేశాలు కలిసి పనిచేస్తే 'గ్లోబల్ సౌత్' స్వరం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత్, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రానున్న రోజుల్లో భారీగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్లలో ఈ వాణిజ్యాన్ని ఏకంగా 20 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వాతో ప్రధాని మోదీ శనివారం ఢిల్లీ సమావేశమయ్యారు. ఇరువురి నేతల మధ్య కీలక ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భవిష్యత్ కోసం డిజిటల్ పార్ట్‌నర్‌షిప్, రేర్‌ఎర్త్ అండ్ క్రిటికల్ మినరల్స్, స్టీల్ సరఫరా గొలుసులో మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి మూడు ఒప్పందాలపై వారిద్దరు సంతకాలు చేశారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లులా ద సిల్వా రాక పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "అధ్యక్షుడు లులాకు, ఆయనతో వచ్చిన ప్రతినిధుల బృందానికి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉంది" అని మోదీ అన్నారు. లులా దార్శనికత, నాయకత్వంలో ఇరు దేశాల సంబంధాలు ఎంతో బలపడ్డాయని కొనియాడారు. గత కొన్నేళ్లలో లులాను తాను పలుమార్లు కలిశానని మోదీ గుర్తు చేసుకున్నారు. ప్రతి కలయికలోనూ భారత్‌పై ఆయనకు ఉన్న నమ్మకం, గొప్ప స్నేహభావం తనకు కనిపించాయన్నారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో లులా పాల్గొన్నారు. దీనిపై ప్రధాని మోదీ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. లులా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త శక్తిని ఇచ్చిందని మోదీ




వ్యాఖ్యానించారు.

**టెక్నాలజీ అనుసంధానం**

లాటిన్ అమెరికా దేశాల్లో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఈ విషయాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు పెంచాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. ఈ వాణిజ్యం కేవలం ఒక అంకె మాత్రమే కాదని ఆయన అన్నారు. ఇది రెండు దేశాల మధ్య ఉన్న నమ్మకానికి, మైత్రికి ప్రతీక అని అభివర్ణించారు. బ్రెజిల్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఏర్పాటు చేయనున్నారు. దీనిపై భారత్ ఎంతో ఉత్సాహంగా, చురుగ్గా పనిచేస్తోందని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. దీనితో పాటు మరికొన్ని కీలక ఆధునిక రంగాలపై ఇరు దేశాలు దృష్టి పెట్టాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సూపర్ కంప్యూటర్లు, సెమీకండక్టర్లు, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీల్లో సహకారాన్ని మరింతగా పెంచుకోనున్నారు. సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలని ఇరు దేశాలు బలంగా నమ్ముతున్నాయి. ఆ సాంకేతికత ఉమ్మడి ప్రగతికి వారధిలా మారాలని నేతలు ఆకాంక్షించారు.

**అత్యున్నత శక్తుల కలయిక**



సంయుక్త ప్రెస్‌మీట్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు లులా ద సిల్వా మాట్లాడుతూ, "నా ప్రియ మిత్రుడు మోదీని మళ్లీ కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ గొప్ప దేశానికి రావడం నాకు ఇది ఆరోసారి. ఇక్కడ నాకు దక్కిన గౌరవానికి అమితంగా సంతోషిస్తున్నాను. భారత్, బ్రెజిల్ దేశాల భేటీ సాధారణమైనది కాదు. ఇదొక అత్యున్నత శక్తుల కలయిక. మనం గ్లోబల్ సౌత్‌లో కేవలం రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు మాత్రమే కాదు. ఒకటి 'డిజిటల్ సూపర్ పవర్' (భారత్), ఇంకోటి 'పునరుత్పాదక ఇంధన సూపర్ పవర్' (బ్రెజిల్). మన రెండు దేశాలు అపారమైన జీవ, సాంస్కృతిక వైవిధ్యానికి కేంద్రాలు. ప్రపంచ శాంతిని, బహుపాక్షిక విధానాలను రెండు దేశాలు బలంగా విశ్వసిస్తాయి" అని లులా పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న సమన్వయం, పరస్పర విశ్వాసానికి ఈ పర్యటనలు అద్దం పడుతున్నాయని ఆయన అన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయాల నేపథ్యంలో భారత్, బ్రెజిల్ పాత్ర చాలా కీలకమని లులా స్పష్టం చేశారు. "ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అస్థిరమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో రెండు దేశాలు వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి, డబ్ల్యూటీవో, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై భారత్, బ్రెజిల్ గొంతుకలు ఎంతో కీలకం. అంతర్జాతీయ చట్టాలకు లోబడి, మరింత న్యాయబద్ధమైన, శాంతియుతమైన బహుపాక్షిక ప్రపంచాన్ని నిర్మించడంలో మనమే ప్రధాన భాగస్వాములం" అని ఆయన ఉద్ఘాటించారు.

# ఇండియన్ ఎప్‌స్టీన్ ఫైల్

జెఫ్రీ ఎప్‌స్టీన్ తరహా లైంగిక వేధింపుల వ్యవహారం ఒకటి తాజాగా భారత్‌లోనూ వెలుగు చూసింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మాజీ జూనియర్ ఇంజినీర్ రాం భావన్ (50), అతడి భార్య దుర్గావతి (47) కలిసి దాదాపు 33 మంది బాలబాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు వెల్లడైంది. 3 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగికంగా వేధించే 2 లక్షల వీడియోలను తీసి, వాటికి రేటు కట్టి డార్క్ వెబ్‌లో 47 దేశాల వాళ్లకు అమ్మేశారని దర్యాప్తులో గుర్తించారు. దాదాపు 12 ఏళ్ల పాటు ఈ దందాను రాం భావన్, దుర్గావతి దంపతులు నడిపారని విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఉత్తర్?ప్రదేశ్‌లోని బాండా పట్టణంలో ఉన్న ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. న్యాయస్థానం వారిద్దరికి మరణశిక్షను విధించింది.

**ఇలాంటి వాళ్లను జైల్లో పెట్టినా మారరు : కోర్టు**

ఇది దారుణమైన దుర్మార్గాలతో ముడిపడిన అత్యంత అరుదైన కేసు అని ఈ సందర్భంగా ప్రత్యేక పోక్సో కోర్టు వ్యాఖ్యానించింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని చాలా జిల్లాల్లో రాం భావన్ దంపతుల బాధితులు ఉన్నారని తెలిపింది. ఈ భార్యాభర్తలు నైతిక విలువలను మర్చిపోయి చిన్నారి బాలికలతో అత్యంత అరాచకంగా ప్రవర్తించారని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి అసాధారణమైన, హేయమైన నేరాలకు పాల్పడే వాళ్లను జైలులో పెట్టి మార్పు తేవడం కూడా కష్టమేనని బాండా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి కామెంట్ చేశారు. అందుకే బాధితులకు న్యాయం చేసేందుకు, రాం భావన్ దంపతులకు మరణశిక్షను విధించామని ఆయన చెప్పారు. బాధిత బాలబాలికలు అందరికీ రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని చెల్లించాలని ఉత్తర్?ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది. రాం భావన్ దంపతుల ఇంట్లో నుంచి సీజ్ చేసిన రూ.8 లక్షలను కూడా బాధిత బాలలకు సరిసమానంగా పంచాలని నిర్దేశించింది.

**రాం భావన్, దుర్గావతి పాపాల చిట్టా**

రాం భావన్, దుర్గావతి దంపతులు 2010లో సెక్స్ రాకెట్‌ను మొదలుపెట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లా కేంద్రంలో ఒక గదిని అద్దెకు తీసుకొని, అందులోనే ఈ వ్యవహారాలన్నీ చేసేవారు. మొబైల్ ఫోన్లు, చాక్‌లెట్లు, వాచ్‌లు, ఆన్‌లైన్



వీడియో గేమ్స్, డబ్బులను ఎరగా వేసి 3 నుంచి 18 ఏళ్లలోపు బాల,బాలికలను ఆకర్షించేవారు.

అనంతరం బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారు. ఈ వ్యవహారాల వీడియోలు, ఫొటోలను తీసేవారు.

2010 నుంచి 2020 వరకు ఈ దందాను రాం భావన్, దుర్గావతి దంపతులు నిరాటంకంగా కొనసాగించారు.

ఈ వ్యవధిలో బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే 2 లక్షలకుపైగా వీడియోలను షూట్ చేశారు. వాటిని 47 దేశాలకు చెందిన కస్టమర్లకు డార్క్ వెబ్ ద్వారా విక్రయించి డబ్బులు సంపాదించారు.

తొలిసారిగా 2020 అక్టోబరులో ఈ సెక్స్ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

2020 అక్టోబరు 31న రాం భావన్ దంపతులపై సీబీఐ కేసును నమోదు చేసింది.

దర్యాప్తు ముగిశాక, 2021 ఫిబ్రవరి 10న సీబీఐ ఛార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేసింది.

ఈ సెక్స్ రాకెట్ బాధితుల జాబితాలో ఉన్న బాలబాలికల ప్రైవేటు భాగాలకు తీవ్ర గాయాలైనట్లు గుర్తించామని దర్యాప్తు నివేదికలో సీబీఐ ప్రస్తావించింది.

తీవ్ర లైంగిక వేధింపుల వల్ల కొందరు బాలలకు మెల్ల కన్ను సమస్య వచ్చిందని సీబీఐ గుర్తించింది.

రాం భావన్ దంపతులు చేసిన ఘోరాలను మర్చిపోలేక ఇప్పటికీ చాలామంది బాధిత బాలలు మానసిక సమస్యలతో సతమతం అవుతున్నారని సీబీఐ పేర్కొంది.

2023 మే 26న రాం భావన్ దంపతులపై ప్రత్యేక పోక్సో కోర్టు అభియోగాలను నమోదు చేసింది.

ఈ కేసులో రాం భావన్ దంపతులు దోషులు అని ప్రత్యేక పోక్సో కోర్టు 2026 ఫిబ్రవరి 18న నిర్ధరించింది.

ఆ ఇద్దరు కీచక భార్యాభర్తలకు మరణశిక్షను విధిస్తూ ఫిబ్రవరి 20న కోర్టు తీర్పును వెలువరించింది.

# ట్రంప్‌నకు షాకిచ్చేలా అమెరికా సుప్రీంకోర్టు తీర్పు

ప్రపంచ దేశాలపై సుంకాల బాదుడు వ్యవహారంలో ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌నకు షాకిచ్చేలా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పుపై భారత వాణిజ్యశాఖ స్పందించింది. శుక్రవారం రోజు అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను తాము పరిశీలించామని వెల్లడించింది. దీనిపై ప్రెసిడెంట్ ట్రంప్ కూడా ఒక మీడియా సమావేశంలో మాట్లాడారని తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కొన్ని చర్యలను చేపడతామని అమెరికా ప్రభుత్వం కూడా ప్రకటించిందని భారత వాణిజ్యశాఖ పేర్కొంది. ఈ అన్ని పరిణామాలను, వాటితో ఏర్పడబోయే పర్యవసానాలను నిశితంగా అధ్యయనం చేస్తున్నామని చెప్పింది. ఈమేరకు భారత వాణిజ్యశాఖ శనివారం ఓ ప్రకటనను విడుదల చేసింది. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై శనివారం ఉదయం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ తీర్పును కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని ఆయన చెప్పారు. దీనిపై అధికారికంగా స్పందించాల్సింది తాను కాదని, కేంద్ర వాణిజ్య శాఖ లేదా విదేశాంగ శాఖ స్పందిస్తాయన్నారు. అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను తాను పత్రికల్లో చదివానని ప్రహ్లాద్ జోషి తెలిపారు. ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా సుంకాలను విధించే రాజ్యాంగ అధికారం దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు లేదని అమెరికా సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం రోజు (ఫిబ్రవరి 20న) స్పష్టం చేసింది. దేశ రాజ్యాంగం కేటాయించిన అధికారాల పరిధికి మించి ట్రంప్ నిర్ణయాలను తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఈఈపీఏ)- 1977 ఇచ్చిన అధికారంతోనే అకస్మాత్తుగా దిగుమతి సుంకాలను పెంచాననే ట్రంప్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. 1977 చట్టం వల్ల అమెరికా అధ్యక్షుడికి అలాంటి అధికారాలేం లభించవని తెలిపింది. ప్రపంచ దేశాలపై విధించే దిగుమతి సుంకాలను ట్రంప్ ఎడాపెడా పెంచడం చట్టవ్యతిరేకమని సుప్రీంకోర్టు బెంచ్ తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు ధర్మాసనంలో మొత్తం 9 మంది న్యాయమూర్తులు ఉండగా, ఆరుగురు న్యాయమూర్తులు ట్రంప్ నిర్ణయాలు చట్ట వ్యతిరేకమైనవి అని తెలిపారు. మిగతా ముగ్గురు న్యాయమూర్తులు మాత్రం ఈ అభిప్రాయంతో విభేదించారు. దీంతో మెజారిటీ న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పే అమల్లోకి వచ్చింది. ఈ తీర్పు ఇచ్చిన అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ఇద్దరిని స్వయంగా ప్రెసిడెంట్ ట్రంపే నామినేట్ చేశారు. అయినా వారు ట్రంప్‌తో ముడిపడిన ఈ కేసులో అత్యంత స్వతంత్రంగా తీర్పును వెలువరించారు. సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా, విదేశీ ప్రయోజనాల ప్రభావం వల్లే సుప్రీంకోర్టు ఇలాంటి తీర్పును ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఈవిధమైన తీర్పును ఇచ్చిన జడ్జీలను చూడటానికి సిగ్గుగా ఉందన్నారు. అమెరికాకు ఏది మంచిదో అది చేసే ధైర్యం వాళ్లకు లేదన్నారు. అమెరికాను కాపాడుకు నేందుకు గతంలో నేను విధించిన దాని కంటే ఎక్కువ సుంకాలను విధించే అధికారం దేశ అధ్యక్షుడికి ఉందని ట్రంప్ కామెంట్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల తాను మరింత శక్తివంతుడిగా మారానని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అంశంపై అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026లో అమెరికాకు రావాల్సిన సుంకాల ఆదాయం ఏమాత్రం తగ్గకుండా చూడటానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నామని ఆయన వెల్లడించారు. వైట్ హౌస్ అధికార వర్గాలు సైతం ఇదే విధమైన వ్యాఖ్యలు చేశాయి. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల తర్వాత ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ట్రంప్ జారీ చేశారు. ఇకపై ప్రపంచ దేశాలపై 10 శాతం సుంకాన్నే విధిస్తామని దానిలో ప్రస్తావించారు. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఫిబ్రవరి 24 నుంచి 150 రోజుల పాటు అమల్లో ఉంటుందని సమాచారం. ఇప్పటికే అమెరికాతో ఖరారైన ట్రేడ్ డీల్‌లో 18 శాతం దిగుమతి సుంకాన్ని చెల్లించేందుకు భారత్ ఓకే చెప్పింది. అయితే సుంకాలను 10 శాతానికి తగ్గించే ట్రంప్ కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ భారత్‌కూ వర్తిస్తుందని వైట్ హౌస్ వెల్లడించింది. అమెరికా ఆర్థిక శాఖ, వైట్ హౌస్ అధికార వర్గాలు మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతున్నామని చెబుతున్నాయి.

## గత పాలకులు పరిశ్రమల్ని తరిమేశారు

-మొదటిపేజీ తరువాయి

దిగజార్చేలా కొందరు ప్రవర్తిస్తున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు తిట్టే పార్టీ రాష్ట్రంలో ఉంది. ఆంబోతుల తరహాలో తయారై రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. గంజాయి రవాణా చేశారు. మదనపల్లెలో గంజాయి సేవించి మానవ మృగంగా ప్రవర్తించాడు. ఆడబిడ్డల జోలికి వస్తే అది వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించాను. చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. ఆ భయంతో ఆ మృగాడు ప్రాణాలు తీసుకున్నాడు. గత పాలకులు శ్రీవారి ప్రసాదాన్ని కూడా నాసిరకంగా తయారు చేయించార. ఆ పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదు. అలాంటి ప్రసాదాన్ని అపవిత్రం చేశారు. వారు సరఫరా చేసిన కల్తీ నెయ్యిని పరీక్ష చేయించాం. జంతువుల కొవ్వు ఉందని ల్యాబ్ నివేదిక వచ్చింది. దీనిపై ఏర్పాటైన సిట్ విచారణ చేసి అది అసలు నెయ్యే కాదని చెప్పింది. వాళ్లు చేసిన తప్పును ఇతరుల పై నెట్టి వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.వివేకా హత్య ఘటనలో నాటకాల రాయుడు రోజుకు ఓ వేషం వేశాడు. చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేంతగా నాటకాలు వేశారు. లడ్డూ ప్రసాదం అపవిత్రం చేశారని చెబితే అవినీతి జరిగిందని చెబుతుంటే తిరిగి హెరిటేజ్‌పై ఆరోపణలు చేస్తున్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత నా ఒక్కడిదే కాదు ప్రజలందరిదీ కూడా. చెడును నిరాకరించే పరిస్థితి ప్రజల్లోనూ రావాలి. అప్పుడే రాజకీయ ప్రక్షాళన జరుగుతుంది.

ఎన్నికల ముందు ఉన్నపళంగా నన్ను అరెస్టు చేస్తున్నామని చెప్పి జైల్లో వేశారు. కేవలం ప్రజల కోసమే, రాష్ట్రం కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నాను. జైల్లో నుంచి తిరిగి రారని చాలా మంది నాకు చెప్పారు. నేను ఏనాడు భయపడలేదు. సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వర స్వామి ఫోటోను కూడా శాసన మండలిలోకి తీసుకువెళ్లి రాజకీయం చేశారు. చెప్పులు వేసుకుని, వేంకటేశ్వరస్వామి ఫోటోను విసిరివేస్తారా.? ఎందుకు వాళ్లకింత అహంకారం?.

రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారు.

పరామర్శలని చెప్పి వెళ్లి వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేస్తారు. బూతులు తిట్టిన వాళ్లను, రౌడీయిజం చేసిన వాళ్లను పరామర్శించే వ్యక్తులు..వాళ్ల కారు కింద పడిన వారిని మాత్రం పరామర్శించరు. శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి దానిని అపవిత్రం చేసిన వ్యక్తులు తిరిగి ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దొంగే దొంగా దొంగా అనే పరిస్థితి వచ్చింది. దీనిని అడ్డుకుని తీరతాం అని సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు.

## బడ్జెట్ సమావేశాలా లేదా లడ్డూ సమావేశాలా

-మొదటిపేజీ తరువాయి

మాత్రమే చేస్తున్నారు. లడ్డూ కల్తీ విషయంలో చర్యలు తీసుకోకుండా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్రంలో ఇంకా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే ఉందా అనే సందేహంలో కొట్టుమిట్టాడు తున్నారు. పాలనాదక్షుడిగా, రాజకీయ అనుభవజ్ఞుడిగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ స్థాయిని దిగజార్చుకుంటు న్నారు. లడ్డు కల్తీకి ఎవరైతే కారకులో వారిపై చర్యలు తీసుకోకుండా మాటలకే పరిమితమవ్వటం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే లడ్డు వివాదానికి ఇకనైనా స్వస్తి పలకాలి. లడ్డు కల్తీకి ఎవరైతే కారకులో వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ఇకనైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై సుహృద్భావ వాతావరణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు చర్చలు జరపాలని కోరుతున్నాం.

## నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమే

నక్సల్స్ ను ఏరివేసినట్లే చొరబాటుదారులను కూడా ఏరివేయడం సాధ్యమేనని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని కామ్‌రూప్‌లో పోలీస్ శాఖ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ వలసదారులను కేవలం ఓటరు జాబితా నుంచి మాత్రమే కాదని, దేశం నుంచి కూడా తొలగిస్తామని అన్నారు. చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాల నుంచి వారిని తరిమికొడితే మరోచోట నివాసం ఏర్పరుచుకునే అవకాశం ఉందని, కాబట్టి వారిని దేశం నుంచే పంపించివేయాలని అన్నారు. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. వారు చెప్పిన మాటలు విశ్వసించవద్దని, ఎందుకంటే వారికి చొరబాటుదారులే ఓటు బ్యాంకు కాబట్టి వారిని పంపించలేరని అన్నారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు అసోంకు ముప్పుగా పరిణమించాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి వస్తే కాంగ్రెస్ కట్టుబడి ఉంటే పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఐదేళ్ల కాలంలో అసోంను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

## ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026...

## న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది. 'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొని పోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.

1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత
6. మానవ వనరుల అభివృద్ధి
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది. 'చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి





**– ఎమ్మెల్యే పరిటాల సునీత**

**– 36మందికి రూ.36.60లక్షల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 21:** రాప్తాడు నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, ఏపీఓ, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి గురించి ఆరా తీశారు. సీసీ రోడ్లు, డ్రైన్లు అలాగే ఉపాధి హామీ కింద సాగుతున్న పనులు ఎంత వరకు వచ్చాయి.. ఎప్పటి వరకు గడువు ఉందన్నది తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. అప్పుడే మనం కొత్తగా నిధులు తీసుకొచ్చి పనులు చేపట్టవచ్చన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటికే అసెంబ్లీలో పలు పనులకు సంబంధించి నిధులు కావాలని కోరినట్టు చెప్పారు. త్వరలో అవి కూడా వచ్చే అవకాశం ఉందని.. ప్రస్తుతం జరుగుతున్న వాటిని వేగవంతం చేయాలన్నారు. అంతకముందు ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన 36మందికి రూ36.60లక్షల విలువైన చెక్కులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కష్టసమయాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా ఆదుకుంటున్నట్టు చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా 19నెలల్లో రూ.8కోట్ల 75లక్షలు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ ద్వారా అందజేసినట్టు తెలిపారు. పేదల ఆరోగ్యం విషయంలో ఈ స్థాయిలో ఎప్పుడూ సాయం అందలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగిన వెంటనే స్పందిస్తున్నారని... నియోజకవర్గ ప్రజల తరుపున ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు...

# బెస్తలు అందరూ ఐక్యంగా ఉండాలి

**– రాప్తాడు నియోజకవర్గం బెస్త సంఘం కమిటీ ఏర్పాటు**

**– బెస్త రమణ రాష్ట్ర నాయకులు**





**అంకుశం అనంతపురం ఫిబ్రవరి 21 :**జిల్లాలోని బెస్త కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని అందరము కలిసికట్టుగా ముందుకు కదరాలని బెస్త సంఘం రాష్ట్ర నాయకులు బెస్త రమణ పిలుపునిచ్చారుఈరోజు బెస్త సేవా సంఘశీ రాప్తాడు నియోజకవర్గం కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాప్తాడు నియోజకవర్గం గ్రామాల నుంచి 20 మంది సభ్యులు హాజరైనారు. కమిటీలు గత మూడు సంవత్సరములలో నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల పై చర్చించడం జరిగింది. ఆ తరువాత నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులు శివశంకర్. తిమ్మరాయుడు, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షులు:- శ్రీనివాసులు. ప్రధాన కార్యదర్శి:- ం. శంకరయ్య, సిండికేట్ నగర్. ట్రెజరర్:- శ్రీమతి ఎ.గాయత్రీ దేవి. ఉపాధ్యక్షులు:- బెస్త ఓబిలేసు, పేరూరు. శ్రీరాములు, .బెస్త చంద్రశేఖర్, వెంకటేష్,ఆదర్శనగర్. కార్యదర్శులు:- రామాంజనేయులు, .రవికుమార్ ,కళ్యాణ్ దుర్గం రోడ్డు. వెంకట్ నారాయణ, ఆదర్శనగర్. శ్రీమతి బి.రామలక్ష్మి, ఆదర్శనగర్.శ్రీమతి బి.అశ్విని, ఆదర్శనగర్. శ్రీమతి బి.నాగమణి, ఆదర్శనగర్. సమావేశంలో గతంలో రాప్తాడు నియోజకవర్గ నుండి ప్రాతినిత్యం ఉన్న జిల్లా కమిటీ సభ్యులను చేర్పులు మార్పులుసి,నూతనంగా 5 మందిని జిల్లా కమిటీకి ఎంపిక చేయడం జరిగింది.సభ్యత్వం జిల్లా మహాసభ లోపల పూర్తి చేయాలని, రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఉన్న బెస్త కుటుంబాలన్నింటిని ప్రత్యక్షంగా కలవాలని తీర్మానించడం అయినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కే వి రమణ,ఉపాధ్యక్షులు, గంగప్ప,ట్రెజరర్ నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, పాల్గొనడం జరిగింది. అని కే శ్రీనివాసులు బెస్ట్ సంఘం రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు తెలిపారు

## రాప్తాడులోచీపురు పట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**– రాప్తాడు పీ.హెచ్.సిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం**

**– పరిశుభ్రత లోపించినా... ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్న సునీత**





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 21:** ప్రభుత్వం ప్రతి శనివారం నిర్వహించే స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చీపురు పట్టారు. రాప్తాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వచ్ఛఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించగా.. ఎమ్మెల్యే సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా అధికారులు, వైద్యులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశుభ్రత చర్యలు చేపట్టారు. చీపుర్లు పట్టి ఆసుపత్రి ఆవరణాన్ని శుభ్రం చేశారు. అనంతరం అక్కడ చికిత్స కోసం వచ్చిన రోగుల్ని, గర్భిణీలు, బాలింతలను పలుకరించారు. ఇక్కడ వైద్యం ఎలా అందుతోంది.. వైద్యులు సమయానికి వస్తున్నారా వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. గర్భిణీలతో మాట్లాడుతూ మీకు సమయానికి ఇవ్వాల్సిన టీకాలు ఇస్తున్నారా.. పోషకాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అక్కడ ల్యాబ్ ను పరిశీలించి.. ఆసుపత్రిలో ఎలాంటి టెస్టులు చేస్తున్నారన్నది ఆరా తీశారు. ఆసుపత్రిలో వెలువడిన మినీ వేస్ట్, డిస్పోండిల్స్ వేర్వేరుగా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో స్వచ్ఛరథం, చెత్తసేకరణ ఆటోని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడ ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు...

# నేటి బాలలే రేపటి రూపకర్తలు





**– ఘనంగా అనంత బాలోత్సవం..**

**– అనంత జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్**

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 21 :** నేటి బాలలే రేపటి స్థలానికి రూపకర్తలని బాల్యమత్యం అత్యంత విలువైనదని బాల్యంలో అన్ని విధాల ఐక్యంగా ఉంటారని మంచి స్నేహితులు ఇక్కటి నుంచే ఏర్పడతారని అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారుఅనంతపురం నగరంలోని ఎస్ఎస్బిఎన్ కళాశాలలో శనివారం అనంత బాలోత్సవం - 2026, పిల్లల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఈఓ ప్రసాద్ బాబు, బాలోత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అనంత బాలోత్సవం కార్యక్రమం నిర్వహించడం, ఇందులో విద్యార్థులు పాల్గొనడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షులు షమీం షఫీ ఉల్లా, ఎస్ఎస్బిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమ్మ, విద్యార్థులు మరియు బాలోత్సవ కమిటీ సభ్యులు, కవులు, రచయితలు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ఇల్లు నిర్మించాలి

**– వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్.మౌర్య భరద్వాజ్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 21 :**శ్రీ సత్య సాయి జిల్లాలోని అర్హులైన ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించాలని అందుకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేయాలని సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు ఆదేశించారు.

(శనివారం) మధ్యాహ్నం 03.00 గంటలకు వివిధ అభివృద్ధి మరియు పరిపాలనాంశాలపై జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించరు. రీ-సర్వే పురోగతి, మ్యుటేషన్లు, పట్టాదార్ పాస్ పుస్తకాల (PPBs) పంపిణీ, సుమోటో దరఖాస్తుల పరిష్కారం మరియు 22A కేసులు. పీజీఆర్ఎస్ , రెవెన్యూ క్లినిక్ మరియు కార్యక్రమాల అమలు. 'అందరికీ ఇళ్లు' పథకం పురోగతి.APORCMS దరఖాస్తుల పరిష్కారం, ాామీా పెండింగ్ అభ్యర్థనలు, వాచ్ డాగ్ మరియు ాాజమీా కోర్టు కేసుల స్థితిగతులు. సివిల్ సప్లైస్, ఎన్నికల విధులు, చీణూా స్టోరేజ్ మరియు కొత్త జిల్లాల్లో జ్యుడీషియల్ కార్యాలయాల కోసం కేటాయించిన భూముల స్థితిగతులు పారిసిలించరు

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు , డీఎస్ఓ , వ్యవసాయ శాఖ జేడీ , తహశీల్దార్లు, మండలం సర్వేయర్లు మరియు సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లు జిల్లా అధికారులు , జుణవీం,పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత...

**– అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు.**



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 21:** సమాజంలోని ప్రతి ఒక్కరు బాల్య వివాహాల నిర్మూలనకు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం అనంతపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి భానుజా ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్తుభారత్ వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన బాల్య వివాహాల నిర్మూలన చైతన్య రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బాల బాలికలకు విద్య ఆరోగ్యం రక్షణ హక్కులు కల్పించడం మనందరి బాధ్యత అన్నారు. అలాగే ప్రభుత్వాలు కూడా అనేక పథకాలను అమలు చేసి వారిని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్వహణ నేరమని తెలిపారు. బాల్య వివాహాల వివరాలు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పాఠశాలలో కళాశాలలో గ్రామసభలు ఆశ్రమ పాఠశాలలో గిరిజన తండాలలో కళాకారుల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పించడం ఎంతోస్ఫూర్తిదాయకమన్నారు
అనంతరం సంతకాల సేకరణ ప్యానెల్ బోర్డుపై ఆర్డిఓ తదితరులు సంతకం చేశారు.
ఈ కార్యక్రమంలో రెడ్ భానుజా, డెమో నాగరాజు, సూపర్వైజర్ ఆషారాణి, తదితరులు పాల్గొన్నారు.

## సత్య సాయి జిల్లాలో11,987 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ -

**– జిల్లా కలెక్టర్ఎ.శ్యామ్ ప్రసాద్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి ఫిబ్రవరి 21:** శ్రీ సత్యసాయి జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై కలెక్టర్ గారు అధికారులతో జిల్లా స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 11,987 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 23.97 వీఔజూ సామర్థ్యంతో ఉచిత సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు మంజూరయ్యాయి. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం చేసే కుటుంబాలకు ఈ అవకాశం. హిందూపురం, కదిరి, పుట్టపర్తి డివిజన్లలో సర్వే పనులను వెంటనే పూర్తి చేయాలి. వెండర్లు మరియు [illegible] అధికారులు సమన్వయంతో ఫీజిబిలిటీ క్లియరెన్స్, మీటర్ ఏర్పాటు మరియు సింక్రనైజేషన్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, లక్ష్యాలను సమయానికి సాధించాలని పేర్కొన్నారు. సమన్వయంతో మీటర్ల ఏర్పాటు, సింక్రనైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అర్హులైన పేద కుటుంబాలకు విద్యుత్ ఖర్చులను తగ్గించి, ఉచిత సౌర విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం.అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ సదుపాయం అందించి, వారి విద్యుత్ ఖర్చులను తగ్గించడం ఈ పథక ప్రధాన లక్ష్యమని కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో పథకానికి సంబంధించిన ఎంపానెల్డ్ వెండర్లు మరియు[illegible] కు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్ ([illegible]), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ([illegible]), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ([illegible]), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ([illegible]) పాల్గొన్నారు.

## సంతాన సాఫల్యత ఉచిత వైద్య శిబిరం ను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 21:** అనపర్తిలో మాజీ జడ్పీటీసీ,మాజీ ఎంపీపీ శ్రీమతి కర్రి శేషారత్నం నివాసం వద్ద లక్ష్మి పెర్టిలిటీ & గైనిక్ హాస్పిటల్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాన సాఫల్యత ఉచిత వైద్య శిబిరం ను ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల,అనపర్తి టౌన్ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆసుపత్రి సమస్యపై అసెంబ్లీలో మాట్లాడటం పట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ కు అభినందనలు.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 21:** పేద వర్గాల ప్రజలకు అత్యంత అవసరమైనటువంటి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి అవసరతను ప్రభుత్వం దృష్టికి వెళ్లే విధంగా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించిన మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు కు పలువురు నేతలు శాలువా కప్పి అభినందనలు వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు మాదిగ, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ తదితరులు ఎమ్మెల్యే ను టీడీపీ కార్యాలయంలో కలిసి అభినందనలు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రజలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ పట్టువదలని విక్రమార్కుడని, ఏదైనా అనుకుంటే సాధించి తీరుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కల రామారావు, జేసీ ప్రసాద్ కౌన్సిలర్లు సవరపు సతీష్ గుండు తాతారాజు. కొవ్వాడ అప్పన బాబు, హోదా ప్రసాద్, పెందుర్తి వెంకటేష్ టిడిపి మైనార్టీ నాయకులు కరీం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిభా కళాశాల విద్యార్థినీలకు రక్త పరీక్షలు



**.పోరుమామిళ్ల, ఫిబ్రవరి 21(అంకుశం పత్రిక):** మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో శనివారం డాక్టర్ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ ఆప్కాస్ రాష్ట్ర బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి 120 మంది విద్యార్థిణిలకు ఉచితంగా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్లడ్ గ్రూప్ యొక్క రకాలు వాటి ప్రాముఖ్యత, విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా వున్నప్పుడే ఆరోగ్యం బాగున్నట్లని తెలిపారు. క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి కాలేజీని మండలంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు అందించాలన్నారు .ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ చెన్ను రాజ శేఖర్, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, వైసిపి పోరుమామిళ్ల టౌన్ అధ్యక్షులు తులసి సురేష్, కళాశాల ప్రిన్సిపల్ నాగ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరూ అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

- రూ. 25 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- ఇతనిపై సుమారు 15 కేసులు... గుట్టురట్టు చేసిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు
- మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించిన అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 21:** ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుండి 25 లక్షలు విలువ చేసే బంగారం వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని అనంతపురం డిఎస్పి శ్రీనివాస్ రావు తెలిపారు అనంతపురం సబ్ డివిజన్లో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు పాల్పడ్డారని వారిని చాకచక్యంగా అనంతపురం అర్బన్ పరిధిలోని సిఐలు అరెస్టు చేశారని అరెస్టుకు సంబంధించిన వివరాలు అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారులి అరెస్టయిన నిందితులు వివరాలు: బాష ఏ కురుబ రామాంజినేయులు, వయస్సు 26 సం.లు, నవోదయ కాలనీ, అనంతపురము... కాగా ప్రస్తుతం స్థానిక చంద్రబాబు కొట్టాలలో ఉంటున్నాడు. వల్లెపు ప్రసాద్, వయస్సు , Y.S.R. కడప స్వాధీనం సొత్తు వివరాలు:






బంగారు ఆభరణాలు: నెక్లెస్‌లు, గొలుసులు, ఉంగరాలు, కమ్మలు, మాటీలు (143 గ్రాములు) వెండి ఆభరణాలు: కడియాలు, కాళ్ల పట్టీలు (సుమారు 500 గ్రాములు) నేరానికి ఉపయోగించిన వాహనములు: 1) Honda Activa (AP39`KS`8726) 2) CB Shine (AP04`AT`7360) మొత్తం వీటి విలువ.. 25 లక్షలు ఖాళీగా ఉన్న ఇళ్లను ముందుగా గమనించడం, యజమానులు బయటకు వెళ్ళిన సమయాన్ని నిర్ధారించడం... రాత్రి వేళల్లో తక్కువ రాకపోకలున్న ప్రాంతాలను లక్ష్యంగా ఎంచుకోవడం... ఇనుప రాడ్లు, కట్టర్లు ఉపయోగించి తాళాలు, బీరువాలు పగులగొట్టడం... కేవలం బంగారు, వెండి ఆభరణాలను మాత్రమే అపహరించడం... దొంగ సొత్తును దాచిపెట్టి, అమ్ముకోవడం...

నేర సమయంలో వాహన నంబర్ ప్లేట్‌ను కప్పి గుర్తింపుకాకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సి.ఐ లు రాజేంద్రనాథ్ యాదవ్, జయపాల్ రెడ్డి, శేషగిరి, రాగిరి రామయ్య, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, తులశన్నల ఆధ్వర్యంలో అనంతపురం త్రీటౌన్ మరియు సిసిఎస్ పోలీసు సిబ్బంది సంయుక్తంగా అరెస్టు చేశారు.

# పర్యావరణానికి ప్రమాదకరం కాకూడదు..





- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ-వేస్ట్ సేకరణ కౌంటర్లు
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్

**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 21:** తమ ఇళ్లు, కార్యాలయాల్లో వృథాగా ఉన్న ఈ-వేస్ట్ పరికరాలను నగరపాలక సంస్థకు అందజేయాలని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలోని ఓల్డ్ టౌన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వారం ఈ-వేస్ట్ సేకరణ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామని గాంధీజీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాతూరు కూరగాయల మార్కెట్ ను సందర్శించారు. అక్కడ వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయని ఆరా తీస్తూ.. పరిసరాలు ఎలా ఉన్నాయన్నది పరిశీలించారు. కూరగాయల వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయవద్దని.. దీనివల్ల మార్కెట్ అపరిశుభ్రంగా మారుతుందన్నారు. మీరు సహకరిస్తేనే మార్కెట్ శుభ్రంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం లాంటి నగరాలు, పట్టణాల్లో ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం ఎక్కువగా ఉంటుందన్నారు. అవి తరచూ మరమ్మతులకు గురి కావడంతో కొత్తవి వాడటం చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో పాతవి వృథాగా ఇళ్లలోనే పెట్టుకుంటున్నారన్నారు. ఇవి భూమిలో కలిస్తే అత్యంత ప్రమాదకర రసాయనయాలతో కలుషితమవుతుందన్నారు. అందుకే ప్రభుత్వం ఈ-వేస్ట్ ని సేకరిస్తోందన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు ఓల్డ్ టౌన్ పోస్ట్ ఆఫీస్ వద్ద ఈ వేస్ట్ సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల సహకరించి ఇక్కడ ఈ వేస్ట్ అందజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుదుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని.. ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# తనకు పోలీసులే రక్షణ కల్పించాలి :ధర్మవరం చేనేత మహిళ

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి:** తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ధర్మవరం పోలీసులను ఆశ్రయించింది వివరాలు ఇలా వున్నాయి. శనివారం ఈ దంపతులు పత్రికా ముఖంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన పేరు తులసి. అని ధర్మవరం పట్టణంలోని రామ్ నగర్ లో నివసిస్తున్నన్న తన భర్త, అతని స్నేహితుడు మన్సూర్ లు ఇద్దరి రాసలీలలు బయట పెడితే సమాజంలో వారి పరువు పోతుందని భావించి నన్ను చంపాలని ప్రయత్నిస్తున్నారు. ప్రతిరోజు నేను, మా నాన్న ఎక్కడికి వెళితే అక్కడికి వస్తూ ఫోటోలు, వీడియోలు తీస్తూ నన్ను చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గారికి ఫిర్యాదు చేయగా ఎస్పీ గారు ధర్మవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్కు పంపించారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప నా భర్త దాశరథి, అతని స్నేహితుడు అయిన మన్సూర్లను పిలిపించి మందలించాడు. అమ్మాయి వెంట పడితే నీపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పోలీస్ శాఖ వారు చెప్పినా కూడా .నా భర్త, అతని స్నేహితుడు మన్సూర్లు ఇద్దరూ నా వెంట పడుతూ నన్ను చంపేందుకు కుట్ర పన్నుతున్నారు. నాకు నా భర్త, అతని స్నేహితుడి నుంచి ప్రాణహాని ఉంది. నన్ను రక్షించాలని కోరుతున్నాను. నన్ను ఎప్పుడైనా ఏమైనా చేసేందుకు సిద్ధ మైన నా భర్త, అతని స్నేహితుడు మన్సూర్ల భాగోతం సమాజానికి తెలపాలని, నాలా ఇంక ఏ ఆడపిల్ల మోసపోకూడదని నా భర్త(గే), అతని స్నేహితుడు మన్సూర్ల భాగోతం బయట పెడుతున్నాను. ఈ వీడియో బయటకు వచ్చిన తర్వాత నన్ను చంపేందుకు ఇంకా ఎక్కువగా ప్రయత్నిస్తారు. పోలీసులే నాకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నాను అని ధర్మవరం చేనేత మహిళ దంపతులు పోలీస్ శాఖ కు విజ్ఞప్తి చేశారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి : ఫిబ్రవరి21:** పుట్టపర్తి నియోజవర్గానికి చెందిన 243 మందికి రూ.2కోట్ల 44 లక్షల 16,613 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతపురం లోని పల్లె నివాసంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో శనివారం పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన 12 మందికి రూ. 6లక్షల 42వేల 682 లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజవర్గం లో సుమారు 243 మందికి 2కోట్ల 44 లక్షల 16,613 లను అందజేసినట్లు తెలిపారు. కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి పెద్ద కొడుకుగా అండగా ఉన్నారని తెలిపారు. ఆపద సమయంలో రక్త సంబంధీకులు కూడా సహాయం చేయడానికి వెనకడుగు వేస్తారని అలాంటిది ముఖ్యమంత్రి చంద్రబాబు నేనున్నానంటూ ఆ కుటుంబానికి అండగా నిలిచి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని కొనియాడారు. ఆపద సమయంలో ఉన్న కుటుంబానికి స్వయాన రక్త సంబంధిత వ్యక్తులు కూడా సాయం చేయరని అలాంటిది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజవర్గానికి చెందిన నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## నాయకుడి పుట్టినరోజును సేవాదినంగా జరుపుకోవడం ఆనందంగా వుంది

- రాష్ట్ర డాక్టర్ల విభాగం కార్యదర్శి కళ్యాణ్ చక్రవర్తి

**.పోరుమామిళ్ల /కాశినాయన, ఫిబ్రవరి 21(అంకుశం పత్రిక):** ఎంఎల్సీ గోవిందరెడ్డి పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర డాక్టర్ల విభాగం కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాశినాయన మండలంలోని ఓబులాపురం గ్రామంలోఉన్న వివేకానంద ఫౌండేషన్ లో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. అనాథలకు భోజనం అందించి వారి ఆశీస్సులను అందుకున్నారు. ప్రజానాయకుడి పుట్టినరోజును సేవా దినోత్సవంగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంఎల్సీ గోవిందరెడ్డి ఆశీస్సులతో ఎలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగుతాయని కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, ఎంపిపి సీ.బాష,కాశినాయన మండల పార్టీ అధ్యక్షుడు హనుమంతు రెడ్డి,జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపిపి రాజశేఖర్, చిత్తా రవిప్రకాష్ రెడ్డి, గంటా రమణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సూర్య ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాస్ఫూర్తితో రాణించాలి :

- విద్యావేత్త గొర్తి వెంకట్ పిలుపు



**అంకుశం న్యూస్ అనంతపురము, ఫిబ్రవరి 21 :** యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుందని ప్రముఖ విద్యావేత్త, రాయలసీమ ప్రజాసమాఖ్య అధ్యక్షులు, కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కక్కలపల్లి పాఠశాలలో విద్యార్థులకు చెస్, క్యారం వంటి ఇండోర్ గేమ్స్ ను హెడ్మాష్టర్ ప్రారంభించారు. జీవితంలో లక్ష్యాలను సాధించడానికి, ఉన్నత శిఖరాలకు చేరడానికి క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. క్రీడలు ఒత్తిడి, ఆందోళనను తగ్గించి, ఏకాగ్రతను పెంచుతాయన్నారు. ఆటలో గెలుపు కంటే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడం చాలా ముఖ్యమన్నారు. ఓడిన వారు నిరుత్సాహపడకుండా, మరోసారి గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు.క్రీడలు లక్ష్యాలను నిర్దేశించుకోవడం మరియు వాటిని సాధించే దిశగా కృషి చేయడం నేర్పుతాయన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రాణించి, మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని కూడా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ నెల థీమ్ "జీరో లిటర్ గవర్నెన్స్" గురించి అవగాహన కల్పించారు. తడి - పొడి చెత్త వేరువేరు సేకరణ, రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల ఫీజుల కోసం పూర్వ విద్యార్థుల అండ



**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 21:** మండలంలోని వినయ్ కుమార్ హైస్కూల్ లో ట్యూషన్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న 23 మంది పేద విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు సామాజిక బాధ్యతగా రూ.20వేలు పాఠశాల మేనేజ్‌మెంట్‌కు ఫోన్ పే ద్వారా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గంధం ప్రకాష్ బాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఆర్థిక ఇబ్బందులను కొద్ది మేర తీర్చేందుకు తమ సంఘం కట్టుబడి ఉందన్నారు. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సీనియర్ లెక్చరర్ గా సేవలందిస్తున్న ఎం. జీవరాజ్ పాల్ వరప్రకాష్ రూ.20,000లను ఫోన్‌పే ద్వారా పంపించగా, ఆ మొత్తాన్ని వెంటనే పాఠశాల యాజమాన్యానికి అందజేయగా ఆయనకు పూర్వ విద్యార్థుల సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఇకపై కూడా వినయ్ కుమార్ హై స్కూల్ అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థుల సంఘం పాఠశాల అభ్యున్నతికి తమవంతు సహకారం నిరంతరం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి జాన్ ప్రభాకర్, జాఫర్ వలి, సభ్యులు జూటూరి మమత, హరీష్, మహేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## లేగ దూడల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

-జిల్లా పశుగణాభివృద్ధి అధికారి డాక్టర్ జి.వెంకటేశు



**రాప్తాడు అంకుశం న్యూస్ ఫిబ్రవరి 21:** మండలంలో మేఘ దూడల పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వెంకటేశు పాడి రైతులకు సూచించారు. డాక్టర్ శ్రీకాంత్ ఎం.బండమీద పల్లి గ్రామంలోశనివారం లేగ దూడల ప్రదర్శనలో సంకర జాతి, దేశవాళీ మరియు ముర్రా జాతులకు చెందిన 52 దూడలు పాల్గొన్నాయి. డాక్టర్ జి. వెంకటేష్, డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో వీర్యదానం చేయడం వలన జరిగే లాభాలు గురించి వివరించారు. పశువుల మీద పోషణ మీద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులు అవగాహన కల్పించారుఎం మేలు జాతి దూడలను ఎంపిక చేసి ప్రథమ బహుమతి యు. నరసింహులుకి, ద్వితీయ బహుమతి బి.రమేష్ కు, తృతీయ బహుమతి డి. వెంకటప్ప, నాలగవ బహుమతి పి రామకృష్ణకు, ఐదవ బహుమతి బి. గణేష్ కు అందచేశారు. పాల్గొన్న అందరూ రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణునల్లు డాక్టర్ యు.సోమేశ్వరి, తోపుదుర్తి డాక్టర్ శారద తోపుదుర్తి, పి. రామకృష్ణా ఉపసర్పంచ్, పశువైద్యశాల సిబ్బంది వెంకటేష్, ఓబులేష్, శివయ్య, నల్లప్ప, ఏహెచ్ఎలు తదితరులు పాల్గొన్నారు.